క్లుప్తంగా

నాణ్యత ప్రమాణాలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: కార్పొరేషన్ పరిధిలో జరిగే అభివృద్ధి పనులను పూర్తి నాణ్యత ప్రమాణాలతో చేపట్టేలా పర్యవేక్షించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో నిర్మిస్తున్న రహదారులు, డ్రైనేజీలు, సంజయ్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయా అభివృద్ధి పనుల నాణ్యతను పర్యవేక్షించారు. చేపట్టిన పనుల నాణ్యత విషయంలో మరింత ప్రత్యేక దృష్టి పెట్టాలని కమిషనర్ కోరారు. ఆయన వెంట ఈఈ మాధవీ, డీఈ సుబ్బారావు, ఏఈ వై.నాగేశ్వరరావు ఇతర సిబ్బంది ఉన్నారు.

ప్రశాంతంగా ద్వితీయ ఇంటర్ పరీక్షలు



వేళంగి కళాశాల వద్ద రూమ్ నంబరు చూసుకుంటున్న విద్యార్థులు

కరప: మండలం వేళంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభంకాగా రెండో రోజు శనివారం తెలుగుపేపర్-2 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. రెండు కేంద్రాల్లో 419 మంది విద్యార్థులకు 18 మంది గైర్హాజరు కాగా, 401 మంది పరీక్షలు రాశారు. పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండింట్ ఎం.శ్రీనివాసరావు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వి.బాలకృష్ణ ఇతర సిబ్బంది పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి, పర్యవేక్షించారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ప్యానల్ న్యాయవాదులు

కరప: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని ప్యానల్ న్యాయవాదులు డాక్టర్ వై.వసంత, పి.గోపాలకృష్ణ పేర్కొన్నారు. మండల న్యాయసేవా అధికారి పి.కమలాదేవి ఉత్తర్వుల మేరకు శనివారం మండలం వేళంగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పౌర హక్కులు, మహిళలకు సంబంధించిన వివిధ రకాల చట్టాలను న్యాయవాదులు వివరించి, వాటి ద్వారా ఎలా రక్షణ పొందవచ్చో అవగాహన కల్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్.రాజేష్, గ్రామ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, వీఆర్వో ఎస్.భీమశంకరరావు, పారా లీగల్ వలంటీర్లు బి.రామస్వామి, పి.మల్లికార్జునరావు, అబ్దుల్ రహీద్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియో అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు

కరప: మండలం వేళంగిలో పల్స్‌పోలియోపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులతో కలసి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. నిండు జీవితానికి రెండుచుక్కలు.. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు ఇప్పించండి.. పోలియో రహిత సమాజాన్ని నెలకొల్పుదాం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఈ.సింధూర, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి చుక్క లెక్క పక్కా

- నాణ్యతలో తేడాపై అప్రమత్తం చేసే ఏర్పాటు
- రూ.7.99 కోట్లతో డిజిటల్ మీటర్లు
- అధునాతన పరిజ్ఞానంతో నూతన సదుపాయం

కాకినాడ: మంచినీటి సరఫరాలో మరో కొత్త సదుపాయం అమలులోకి వచ్చింది. జలాశయాల నుంచి వచ్చే ముడినీటిని పక్కాగా లెక్కించే విధానంతో పాటు ప్రజలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యతను తక్షణమే తెలియజేసేలా వైర్‌లెస్ డిజిటల్ వాటర్ మీటర్ అండ్ ఆన్‌లైన్ వాటర్ క్వాలిటీ ఎనలైజర్‌ను నగరపాలక సంస్థ అందుబాటులోకి తెచ్చింది. ఈ పరికరాల వల్ల ప్రతి నీటి బొట్టుకు పక్కా లెక్క తేలనుంది. ఎక్కడైనా నీటి సరఫరాలో అవాంతరం ఎదురైనా, కలుషితం ఏర్పడినా కార్పొరేషన్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తుంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఏర్పాటు చేసిన ఈ విధానం విశాఖ, రాజమహేంద్రవరం వంటి నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉంది.

రూ.7.99 కోట్లతో ఏర్పాటు

వాటర్ మీటరింగ్ సిస్టమ్‌ను రూ.7.99 కోట్ల ఖర్చుతో ఏర్పాటు చేశారు. ఎంత నీరువస్తోంది? ఎంత వినియోగంలోకి వెళ్తోంది? ఎంత వృథాపోతోంది? అనే సమాచారాన్ని ఎలక్ట్రో మేగ్నటిక్ ఫ్లో మీటర్ ద్వారా అప్పటికప్పుడే తెలుసుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. సోలార్ సిస్టమ్ ద్వారా ఇది పనిచేస్తుంది.

26 ట్యాంకులకు మీటర్లు

జలాశయాల ద్వారా కాకినాడ ప్రజలకు నీటిని సరఫరా చేసే విక్టోరియా వాటర్‌వర్క్స్, శశికాంత్‌నగర్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల పరిధిలో దాదాపు 26 వాటర్ ట్యాంకులు ఉన్నాయి. ప్రస్తుతం వీటి సామర్థ్యం 84.91 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) కాగా, ప్రస్తుతం ప్రజల అవసరాల మేరకు రోజుకు రెండుపూటలా గంటన్నర చొప్పున 46 ఎంఎల్‌డీల నీటిని సరఫరా చేస్తున్నారు. వీటన్నింటికీ ఇప్పటికే వాటర్ మీటర్లు అమర్చారు. నీటి వినియోగం, నిల్వలను ఎప్పటికప్పుడు ఇవి తెలియజేయనున్నాయి.

క్వాలిటీ ఎనలైజర్ల ఏర్పాటు

ఇక మంచినీటి నాణ్యతను ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు వాటర్ క్వాలిటీ ఎనలైజర్లను కూడా ఏర్పాటు చేశారు. ముడినీటి నుంచి శుద్ధిచేసిన అనంతరం ప్రజలకు సరఫరా చేసే వరకు ఎక్కడైనా నీటి నాణ్యత లోపిస్తే ఈ పరికరం ద్వారా తక్షణమే నగరపాలక సంస్థను సదరు పరికరం అప్రమత్తం చేస్తుంది. క్లోరిన్ శాతం తక్కువగా ఉన్నా అధికారులను సదరు పరికరం అప్రమత్తం చేయిస్తుంది. 24 గంటలు పనిచేసే ఈ మీటర్లను పర్యవేక్షించేందుకు సెంట్రల్ స్క్వాడ్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీటి నిర్వహణను స్మార్ట్‌సిటీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు.



నీటి సామర్థ్యంపై సెంట్రల్ స్క్వాడ్ స్టేషన్‌కు సమాచారం అందజేసే ఆర్‌టీయూ ప్యానల్. (అంతర చిత్రం) నీటి సామర్థ్యాన్ని తెలియజేసే పరికరం



నీటి సామర్థ్యాన్ని తెలియజేసే ఎలక్ట్రో మేగ్నటిక్ ఫ్లో మీటర్

ఇఎల్ఎస్ఆర్‌లకు మీటర్లు



కాకినాడ నగరపాలక సంస్థలోని దాదాపు అన్ని ఇఎల్ఎస్ఆర్ (ఎలివేటెడ్ లెవెల్ సర్ఫేస్ రిజర్వాయర్) లకు మీటర్లను ఏర్పాటు చేశాం. ఇవి ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. ఎప్పటికప్పుడు నీటి నిల్వల సామర్థ్యాన్ని గుర్తించడంతో పాటు నీటి నాణ్యతను కూడా తెలియజేసే ఈ పరికరాలు కాకినాడ కార్పొరేషన్ అభివృద్ధిలో మరో సౌకర్యంగా చెప్పవచ్చు.

– జె.వెంకటరావు, కమిషనర్, నగరపాలక సంస్థ

సమస్య గుర్తించేందుకు దోహదం



వైర్‌లెస్ డిజిటల్ వాటర్ మీటర్, వాటర్ క్వాలిటీ ఎనలైజర్ల వల్ల ఎంతో ప్రయోజనం ఉంది. అనేక సందర్భాల్లో నీటి కాలుష్యం, పైప్‌లైన్లు ధ్వంసం కావడం వంటి సమస్యలు ఎదురైనప్పుడు గుర్తించడం ఇంతకాలం కష్టతరంగా ఉండేది. ఇప్పుడు ఈ పరికరాలు అందుబాటులోకి రావడంవల్ల సమస్యను గుర్తించి పరిష్కరించడం సులభమవుతుంది.

– పి.వెంకటరావు, ఎస్ఈ, స్మార్ట్‌సిటీ

విద్యా హక్కు చట్టాన్ని పరిరక్షించుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది ముప్పాళ్ల

కాకినాడ సిటీ: పేదలకు అందాల్సిన విద్య దూరం అవుతోందని అందువల్ల విద్యాహక్కు చట్టాన్ని పరిరక్షించుకోవాలని పౌరహక్కుల పోరాటనేత, న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు అన్నారు. శనివారం కాకినాడలో విద్యార్థుల సాధన కోసం పేరెంట్స్ టీచర్స్ అండ్ స్టూడెంట్ ఫెడరేషన్ (పీటీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కొల్లపు వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. దేశంలో అన్నీ రాజ్యాంగ ప్రకారం నడుచుకుంటే విద్య మాత్రం ఎందుకు రాజ్యాంగం ప్రకారం నడుచుకోవడం లేదంటూ ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే విద్యారంగాన్ని బలోపేతం చేసి విద్యను పేదలకు దగ్గర చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నామని ముప్పాళ్ల అన్నారు. సృజనాత్మక విద్యను అందించి పాఠ్యాంశాలలో దేశభక్తులు, చరిత్రకారుల గురించి పాఠ్యాంశాలు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యను కొనుక్కోవడం కాదని విద్యను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీటీఎస్ఎఫ్ నాయకులు ములుగు కిరణ్‌కుమార్, పరమట భారతి, కరీమున్నీసా, కాకిలేటి రవీంద్ర, బావిశెట్టి రామకృష్ణారావు, పెచ్చెట్టి వరప్రసాద్, అర్థాల కుమార్‌బాబు, నక్కా వెంకటరత్నం, రాజు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు



వైఎస్సార్ సీపీలో చేరిన గుడారిగుంట మహిళలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రభుత్వానికి మంచి జరిగేలా పార్టీ కోసం కష్టపడి పని చేసేవారికి తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రూరల్ నియోజవర్గంలోని కాకినాడ అర్బన్ 3వ డివిజన్ గుడారిగుంటకు చెందిన సీనియర్ నాయకురాలు ఎస్.దైవకృపకు పార్టీ కాకినాడ నగర విభాగం కార్యదర్శిగా నియమితులవ్వడంతో ఆమెను అభినందించారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఆమె మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్, భువనేశ్వరి తదితరులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కన్నబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ విజయానికి కష్టపడి పనిచేయాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, మహిళా విభాగం నాయకురాలు జమ్మలమడక నాగమణి, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, నల్ల రాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో పలువురి చేరిక

కాకినాడ నగరం మూడో డివిజన్ గుడారిగుంట జయప్రకాశనగర్‌కు చెందిన పలువురు మహిళలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. మాజీ కార్పొరేటరు వడ్డి మణికుమార్, దైవకృప, భువనేశ్వరి తదితరులు ఆధ్వర్యంలో రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో చేరారు. పార్టీ కండువాలు వేసి వారిని సాదరంగా ఆహ్వానించిన కన్నబాబు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కష్టపడి పనిచేయాలని కోరారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో బంగారు శాంతి, కమల, మచ్చా అప్పలకొండ, పల్లా ఇందిరాప్రియదర్శి, మచ్చా చక్రమ్మ, హేమలత, చింతా మాధవి, అర్జమ్మ, దడాల సత్యవతి, తేజ, సోమాదుల నాగలక్ష్మి తదితరులు చేరారు.



దైవకృపను అభినందిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

ఎన్నికల విధులు సమర్థంగా నిర్వహించాలి

- ఈఆర్వో వెంకటరావు

కాకినాడ: త్వరలో జరగనున్న ఎన్నికలను సజావుగా నిర్వహించడంలో వివిధ విభాగాల్లో నియామకమైన ఎన్నికల సిబ్బంది సమర్థవంతంగా పనిచేయాలని సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు కోరారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిస్టిక్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలు, పోలీస్ సెక్టార్ ఆఫీసర్లు, ఐటి బృందాలతో ఎన్నికల విధులపై శిక్షణ నిచ్చారు. డీఎస్పీ కె.హనుమంతరావు, డీఎల్‌డీవో ప్రసాదరావుతో పాటు సెక్టోరల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు హాజరయ్యారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమితులైన సిబ్బందికి మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఎన్నికలు జరిగే రోజున, అంతకు ముందు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలను వివరించారు. ఈ సందర్భంగా ఈఆర్వో వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా విధి నిర్వహణలో ఉండే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎటువంటి లోటుపాట్లు, సమస్యలకు ఆస్కారం లేకుండా విధులు నిర్వర్తించాలని, ఆ మేరకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఏఈ ఆర్వోలు హరిదాసు, నాగశాస్త్రులు, ఆర్వో డీటీ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటరావు

మహావీర్ అనుగ్రహంతో ముక్తిమార్గం

- జైనుల సన్యాస దీక్ష ర్యాలీలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పాల్గొన్న పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి



జైనుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, పార్లమెంట్ కో-ఆర్డినేటర్ సునీల్ తదితరులు

కాకినాడ: సుఖం, ధనం, వ్యామోహాలను త్యాగం చేయడం ద్వారా ముక్తిమార్గాన్ని అనుసరించాలన్న మహావీర్ ప్రవచనాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుతున్న జైన మతస్తులకు మరింత మంచి జరగాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. కాకినాడ జైన మతానికి చెందిన ప్రియల్ సన్యాసదీక్ష తీసుకుంటున్న సందర్భంగా శనివారం మార్వాడీలు నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ కాకినాడ పార్లమెంటరీ జిల్లా కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేవాలయంవీధి, తిలక్‌వీధి, రాజాజీవీధి, మెయిన్‌రోడ్డు మీదుగా టీటీడీ వరకు ప్రదర్శన నిర్వహించారు. కాకినాడతో పాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జైనులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ సుఖాలు, ఆడంబరాలకు దూరంగా త్యాగాలు చేసి దేవుని మార్గంలో నడిస్తే మోక్షం లభిస్తుందన్న ఆకాంక్షతో చిన్న వయస్సులోనే ప్రియల్ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆమె ఆకాంక్ష నెరవేరాలన్నారు. కాకినాడ పార్లమెంటరీ కో–ఆర్డినేటర్ చలమలశెట్టి సునీల్ మాట్లాడుతూ ప్రేమ, దయ గుణానికి మారుపేరుగా నిలిచే జైన మతస్తులకు అన్ని విధాలా మంచి జరగాలని ఆకాంక్షించారు. సుఖసంతోషాలను త్యాగం చేయడం ద్వారా మానవజన్మ ఉత్తమమైనదిగా భావించే జైనులు దీక్షా సమయంలో అత్యంత భక్తిభావంతో వ్యవహరిస్తారన్నారు. దేవుని అనుగ్రహం కోసం కఠోరదీక్షతో అనేక ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. జైన గురువు భక్తిరత్న గురూజీ ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి బన్ని, జైన్‌మత ప్రతినిధులు నిర్మల్‌కుమార్ జైన్, మహేంద్ర జైన్, సంజయ్ జైన్, కైలాష్ జైన్, ఆషిక్ జైన్, రజనీష్ జైన్, రమేష్ జైన్‌తోపాటు వందలాది మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్వాడీలు పల్లకి ఊరేగింపులు, డప్పులు, వాయిద్యాలతో సందడి చేశారు.

రిజిస్ట్రేషన్‌తో ఇల్లు విప్లవాత్మక నిర్ణయం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ఉప్పాడలో 889 మందికి ఇళ్ల పట్టాలు
- పాల్గొన్న ఎమ్మెల్సీ, కౌడా చైర్‌పర్సన్

కాకినాడ: అర్హులైన ప్రతి లబ్ధిదారుకు స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించడంతో పాటు రిజిస్ట్రేషన్ కూడా చేసి అప్పగించే విధానం దేశంలో ఎక్కడా లేదని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఈ విధానం విప్లవాత్మకమైనదన్నారు. స్థానిక ఉప్పాడ కొత్తపల్లిలో 10, 11, 12 డివిజన్లకు చెందిన సుమారు 23 ఎకరాల లే అవుట్‌లో 889 మంది లబ్ధిదారులకు శనివారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కేటాయించిన స్థలాలు, కొమరగిరిలో నిర్మిస్తున్న ఇళ్లను బస్సులలో తీసుకువెళ్లి చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది అక్కాచెల్లెమ్మల ముఖంలో సంతోషం వెల్లివిరియాలనే లక్ష్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ళ స్థలాలను మహిళల పేరుతోనే జారీ చేస్తున్నారన్నారు. పట్టాలు పొందిన మహిళలందరికీ తమ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే శరవేగంగా గృహనిర్మాణాలు చేపట్టి 18 నెలల వ్యవధిలో స్వగృహప్రవేశం చేయించి సొంతింటికలను నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, కార్యదర్శి ఎం.ఏసుబాబు, మాజీ మేయర్, వైఎస్సార్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, ఐటీ సెల్ చైర్‌పర్సన్ కృష్ణప్రియ, మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉప్పాడ కొత్తపల్లి లే అవుట్‌ను సందర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, నాయకులు, అధికారులు

కార్యకర్తకు ద్వారంపూడి పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక 9వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గంధం శివను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి శనివారం పరామర్శించారు. ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఆయన వెంట మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ కంపర బాబి, నాయకులు హేమంత్ ఉన్నారు.

మహిళలకు ఇంటి పట్టాల పంపిణీ

కాకినాడ రూరల్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలం పట్టాలిచ్చి ఆదుకున్నారని, వారి పేరున రిజిస్ట్రేషన్ చేయించి అప్పగిస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని నేమాం పంచాయతీ పరిధిలోని గుత్తులవారిపాలెం గ్రామంలో పేదలకు ఇళ్ల పట్టాలను ఆయన శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ నేమాం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామన్నారు. స్థానికంగానే ఇళ్ల పట్టాలు కోరడంతో గుత్తుల వారిపాలెం వాసులకు అందించామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలో సుమారు 32 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో చాలా మంది నిర్మాణాలు చేపట్టారని, ఇప్పటికికే నేమాం, తిమ్మాపురం, సూర్యారావుపేట తదితర చోట్ల నివాసాలు ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామదేవు సూర్య ప్రకాశరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, వైస్ ఎంపీపీ గుత్తుల సత్తిబాబు, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, పండూరు ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి శ్రీనివాసరావు, నందిపాటి ధర్మరాజు. తదితరులు పాల్గొన్నారు.



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

ఓఎన్‌జీసీ పరిహారం కోసం నిరసన దీక్షలు



నిరసన తెలియజేస్తున్న మత్స్యకారులు

కాకినాడ: ఓఎన్‌జీసీ కార్యకలాపాలతో నష్టపోతున్న కాకినాడ ప్రాంత మత్స్యకారులకు కూడా నష్టపరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌తో చేపట్టిన నిరసన కార్యక్రమం శనివారం కొనసాగింది. పోర్టు ప్రాంతంలో మత్స్యకారులు శిబిరాలు వేసుకుని నిరసన కొనసాగిస్తున్నారు. వీరికి పగడాలపేట, ఉప్పలంక, గోళీలపేట, ఏటిమొగ, దుమ్ములపేట, పర్లోపేట ప్రాంతాల మత్స్యకారులు కూడా తరలివచ్చి పెద్ద ఎత్తున సంఘీభావం తెలియజేస్తున్నారు. ఇప్పటికే సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మద్దతు ప్రకటించిన నేపథ్యంలో మత్స్యకారులు ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా మత్స్యకారులు కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఓఎన్‌జీసీ దిగి వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కాకినాడ రేవు నుంచి కార్యకలాపాలను కొనసాగించే ప్రసక్తి లేదంటూ స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి సోమవారం ఓఎన్‌జీసీ ప్రతినిధులతో సమావేశమై వీరి డిమాండ్‌ను చర్చించేందుకు ప్రయత్నిస్తున్నారు. సమస్య కొలిక్కి వచ్చే వరకు దీక్ష కొనసాగిస్తామంటూ మత్స్యకారులు స్పష్టం చేస్తున్నారు. మత్స్యకార ప్రతినిధులు కాటాడి జానకిరామ్‌తో పాటు స్థానిక నాయకులు అంకాడి సత్తిబాబు, పంతాడి బ్రహ్మానందం, పేర్ల జోగారావు తదితరులతో పాటు మత్స్యకార గ్రామానికి చెందిన పెద్దలు కార్యక్రమానికి హాజరై మద్దతు ప్రకటించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి జపయజ్ఞ సంకీర్తన



జపయజ్ఞ సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని భోగి గణపతి పీఠంలో శ్రీవారి పాదాల వద్ద శనివారం సామూహిక సహస్రనామ పారాయణ జపయజ్ఞ సంకీర్తన నిర్వహించారు. పీఠంలో ఉన్న పంచలోహ శ్రీవారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం వ్యవస్థాపకుడు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ శ్రీవారి పాదాల వద్ద ఏడు శనివారాలు దీపారాధన చేసి వృద్ధులకు, అనాథలకు వస్త్రాలు, పాదరక్షలు, గొడుగులు, విసనకర్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రూరల్ సీటు శెట్టిబలిజలకు కేటాయించాలి

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ సీటును ప్రధాన రాజకీయ పార్టీలన్నీ అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన శెట్టిబలిజ సామాజిక వర్గీయులకే కేటాయించాలని శెట్టిబలిజ జన జాగృతి సేవా సంఘం, బీసీ వెల్ఫేర్ అసోసియేషన్లు సంయుక్తంగా డిమాండ్ చేశారు. శెట్టిబలిజ సంఘ నాయకులు కాకినాడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాకినాడ రూరల్ అసెంబ్లీ సీటును శెట్టిబలిజలకే కేటాయించాలని, జిల్లాలో బీసీ సామాజిక వర్గం అత్యధికంగా ఉన్న కాకినాడ అర్బన్, తుని, పెద్దాపురం, ప్రత్తిపాడు అసెంబ్లీ స్థానాలు, కాకినాడ పార్లమెంటు స్థానం బీసీలకు కేటాయించాలని జన జాగృతి సేవా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో శెట్టిబలిజ సంఘం నాయకులు రాయుడు నాగేశ్వరరావు, కర్రి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

